క్లుప్తంగా

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న పురుషోత్తమరావు

పెదగంట్యాడ: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. అమర్‌రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ (తిరుపతి) హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ పురుషోత్తమరావు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మేళాకు 284 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 238 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ మేళాను ఐటీఐ ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించగా ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కనుల పండువగా పరస



పూజలందుకున్న సీతారామ లక్ష్మణ స్వాములు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్‌లో కోదండ రామాలయ పరస మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. శుక్రవారం వేకువ జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని సీతారామ లక్ష్మణ స్వాములను దర్శించుకుని పూజలు నిర్వహించారు. పలు రకాల స్టాళ్లు కొలువు తీరాయి. ఈ సందర్భంగా యూత్ కమిటీ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పరస మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు గ్రామ పెద్దల కమిటీ, రామభజన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో దొంగల హల్‌చల్

పెదగంట్యాడ: మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సిరిపురపు గోవింద్ అనే వ్యక్తి కుటుంబంతో నివాసం ఉంటున్నారు. తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి ఇంట్లోని కింద గదిలో పడుకొని ఉండగా పై గదిలోకి దొంగలు తాళం పగులగొట్టి ప్రవేశించారు. ఆ గదిలో ఉన్న రెండు కటింగ్ మిషన్లు, వైర్ కట్టలు, సుత్తులు, గడ్డపారలు తాపీ పనికి సంబంధించిన వస్తువులు చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.20వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. 100కు డయల్ చేయగా న్యూపోర్టు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌లో అగ్రగామిగా నిలుద్దాం



మాట్లాడుతున్న గాజువాక జోన్ శానిటరీ సూపర్‌వైజర్ రామారావు

అగనంపూడి: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మహా విశాఖ నగరాన్ని అగ్రగామిగా నిలపడానికి అంతా సహకరించాలని జీవీఎంసీ గాజువాక జోన్ శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు అన్నారు. 85వ వార్డు అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో డ్రైడే-ఫ్రైడే, ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీజన్‌లో విపరీతమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా నార, గుడ్డ సంచులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రసాద్, కృష్ణవేణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.సీతారామయ్య, యాంటీ మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు, నాయకులు కె.దేవేంద్ర, బి.సత్యనారాయణ, కె.రాంబాబు, డి.రమేష్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షల కోసం క్యూలో రోగులు

- నకల వనతుల కల్పన
- నాడు 8 మంది డాక్టర్లతో వైద్య సేవలు
- ప్రస్తుతం ఇద్దరే వైద్యులు
- ప్రత్యేక శ్రద్ధతో సేవలందిస్తున్న వైద్యులు
- కొనసాగుతున్న రోగుల తాకిడి

ఆరోగ్య ప్రదాయిని!

గాజువాక పీహెచ్‌సీ రూపు రేఖలు మార్చిన గత ప్రభుత్వం

నాటి సర్కారు ముందు చూపు వల్ల పారిశ్రామిక ప్రాంతంలోని పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతోంది. డబ్బులేని కారణంగా ఏ ఒక్కరూ వైద్యం అందక ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో నాడు– నేడు కింద ప్రభుత్వ ఆస్పత్రుల రూపు రేఖలు మార్చింది. భవనాలతో పాటు ల్యాబ్, మందులు సమకూర్చింది. స్పెషలిస్ట్ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. అలా గాజువాక పీహెచ్‌సీ రూపు రేఖలు కూడా మార్చింది. అత్యాధునిక వసతులు కల్పించింది. నాడు రెగ్యులర్ వైద్యులతో కలిపి 8 మంది వైద్యులు స్పెషలిస్టు సేవలు కూడా అందించేవారు. కూటమి సర్కారు వచ్చిన తర్వాత స్పెషలిస్టు వైద్య సేవలకు మంగళం పాడేసింది. అయితే ప్రస్తుతం పీహెచ్‌సీలో ఉన్న వైద్యులు శ్రద్ధగా సేవలందించడంతో ఇక్కడ వైద్యం కోసం ప్రజలు క్యూ కడుతున్నారు.



మందులు అందజేస్తున్న ఫార్మసిస్టు



గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గాజువాక: గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) రోగుల పాలిట వరప్రదాయినిగా మారింది. కూటమి సర్కారు స్పెషలిస్ట్ వైద్య సేవలను ఎత్తి వేసినా.. పీహెచ్‌సీలో ఉన్న సౌకర్యాలు.. ప్రస్తుత వైద్యుల పనితీరుతో క్యూ కడుతున్నారు. ఇక్కడ రోజుకు 160 మంది ఔట్‌పేషెంట్ (ఓపీ) కేసులు నమోదవుతున్నాయంటే ప్రజల్లో దీనికున్న ఆదరణ అర్థం చేసుకోవచ్చు. సాధారణ ఓపీలను పీహెచ్‌సీ వైద్యాధికారి చూసి మందులు అందజేస్తారు.

హెచ్‌ఐవీ బాధితులకు ..

హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించేందుకు ఇక్కడ పరీక్షా కేంద్రం ఉంది. ల్యాబ్ టెక్నీషియన్ సేవలు అందిస్తున్నారు. పాజిటివ్ వచ్చిన రోగులను అగనంపూడిలోని ఏఆర్‌టీ సెంటర్‌కు పంపిస్తారు. అక్కడ వైద్యుల పర్యవేక్షణలో నిరంతరం వైద్య సేవలు అందిస్తారు. కుష్టు, టీబీ వ్యాధుల నివారణకు ప్రత్యేక చికిత్స కేంద్రం ఉంది. నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఇది నడుస్తోంది. రోగుల మచ్చలు, లెప్రసీ కేసులను పరిశీలించి మందులు ఇస్తారు. అసిస్టెంట్ పారా మెడికల్ అధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు సేవలు అందిస్తున్నారు.

మాతా శిశు సంరక్షణ

మాతా శిశు సంరక్షణలో భాగంగా గర్భిణులకు ప్రతి నెలా 9వ తేదీన పీహెచ్‌సీలో ఉచిత ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తారు. రిస్క్ ఉన్న గర్భిణులకు ప్రతినెలా 10న తనిఖీ చేస్తారు. అవసరమైతే గైనకాలజీలకు రిఫర్ చేస్తారు.

రెండు రోజులు వ్యాక్సినేషన్

ప్రతి బుధ, శనివారాల్లో పిల్లలకు పెంటావ్యాలెంట్, పోలియో వ్యాక్సినేషన్ వేస్తారు. ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు అందజేస్తారు. ఆస్పత్రిలోనే కాకుండా బుధ, శనివారాల్లో నిర్దేశిత ఉప కేంద్రాల్లోనూ పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇస్తారు. జననీ సురక్ష యోజన పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రిలో పురుడు పోసుకుంటే రూ.600 నగదు ప్రోత్సాహకాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో జమ చేస్తారు.

అందుబాటులో ఫ్యామిలీ డాక్టర్

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను వైద్యులు విజయవంతంగా అమలు చేస్తున్నారు. పీహెచ్‌సీకి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలకు 104 వాహనాన్ని పంపించడంతోపాటు ఒక డాక్టర్, ఏఎన్ఎం సహా సిబ్బంది రోగుల ఇళ్లకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు.



ల్యాబ్ వద్ద క్యూ లైన్

అందుబాటులో రక్త పరీక్షలు

రోగ నిర్ధారణకు అవసరమైన రక్త పరీక్షలు, వైద్య పరీక్షలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ), ఆర్‌బీఎస్, బ్లడ్ గ్రూపింగ్, మలేరియా, డెంగ్యూ, బ్లడ్ ఇన్ఫెక్షన్ పరీక్షలు, సీ క్రియాటిన్, ఈసీజీ, యూరిక్ యాసిడ్ టెస్టు, కొలెస్ట్రాల్, బయోకెమిస్ట్రీ ఎనాలిసిస్, సోడియం పొటాషియం, సీబీసీ, ప్లేట్‌లెట్, యూరిన్ కంప్లీట్ ఎనాలిసిస్, హెచ్‌సీవీ, హెపటైటిస్ బి, హెపటైటిస్ సీ, టీబీ ఆర్టీపీసీఆర్ టెస్టు వంటి పరీక్షలను పీహెచ్‌సీలో ఉచితంగా అందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 63 ఆరోగ్య పరీక్షలు అందిస్తుండగా, గాజువాక పీహెచ్‌సీలో 55 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అంధత్వ నివారణకు ప్రత్యేక కేంద్రం

గాజువాక పీహెచ్‌సీలో అంధత్వ నివారణ కేంద్రం నడుస్తోంది. పీహెచ్‌సీలో ప్రతి సోమవారం ఆప్తాలమిక్ అధికారి అందుబాటులో ఉంటారు. కళ్ల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారు. అవసరమైనవారికి కళ్లద్దాలు కూడా ఉచితంగా అందజేస్తారు. కళ్లకు శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తే ఆప్తాలమిక్ అధికారి నేతృత్వంలో రోగులను విశాఖ లేదా విజయనగరం ఆస్పత్రులకు తీసుకెళ్తారు.
రాష్ట్రీయ బాల స్వస్తిక్ కార్యక్రమం కింద గురువారం ఒక్కో పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. పెద్ద కేసులుంటే పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేస్తారు.

బాధ్యతగా సేవలు



పీహెచ్‌సీకి వచ్చే వారికి ఉన్నంతలో నాణ్యమైన సేవలు అందిస్తున్నాం. ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు ఖరీదైన మందులను కూడా ఉచితంగా అందిస్తాం. నిష్ణాతులైన టెక్నీషియన్లతో రక్త పరీక్షలు, ఈసీజీ వంటి సేవలు అందిస్తున్నాం. ఇక్కడ ఇద్దరు వైద్యాధికారులు అందుబాటులో ఉంటారు. అత్యవసర కేసులైతే పెద్ద ఆస్పత్రులకు పంపిస్తున్నాం.
– డాక్టర్ ఎం.సుధాకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, గాజువాక

గిరిజన ఉద్యోగుల సంక్షేమానికి కృషి



అప్పలరాజు, రాథోడ్‌లను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

ఉక్కునగరం: గిరిజన ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని విశాఖ జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు ఎస్. అప్పలరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి రాథోడ్ వస్రామ్ అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన సందర్భంగా శుక్రవారం స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు వారిని సత్కరించారు. కోక్‌ఓవెన్స్ విభాగాధిపతి ఎ.వి.ఎస్. దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నాయకులు జిల్లా సంఘం ఎన్నికల్లో గెలుపొందడం అభినందనీయమన్నారు. సన్మానగ్రహీతలు మాట్లాడుతూ సిటీ పరిధిలో 5000 మంది గిరిజన ఉద్యోగులు ఉన్నారని, స్టీల్‌ప్లాంట్‌లో 1000 మంది ఉన్నారని.. ఉక్కు పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఏసీఎస్ సీనియర్ మేనేజర్ జి. సురేష్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అధికారులు రవికుమార్, బి.ఎస్.ఆర్. నాయక్, అమర సింగ్, దుర్గాప్రసాద్, వివిధ కార్మిక సంఘాల నాయకులు కొమ్ము ప్రసాదరావు, టి. కనకరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుకు శాశ్వత పరిష్కారం చూపాలి

పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్



రిలే దీక్షా శిబిరంలో సంఘీభావం తెలుపుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీల వల్ల ఒరిగేది ఏమీ ఉండబోదని ఏపీ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీల నేతృత్వంతో కూర్మన్నపాలెం కూడలిలో శుక్రవారం చేపట్టిన1443 రోజు రిలే దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పగా చెప్పుకుంటున్న ఈ ప్యాకేజీ ఏ మూలకు సరిపడదని, ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించబోమని, సొంత గనులు కేటాయిస్తామని చెప్పినప్పుడే తెలుగు రాష్ట్ర ప్రజలు సంతోషిస్తారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి భారత దేశంలో అగ్రగామి సంస్థగా పేరుందని, అటువంటి సంస్థను పూర్తి సామర్థ్యంతో నడపడానికి చర్యలు చేపట్టాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించడానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపైకి రావాలన్నారు. కార్యక్రమంలో ఏపీ పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు, నాయకులు జీఏ నారాయణరావు, ఉక్కు కార్మిక సంఘాల నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, దాసరి సురేష్‌బాబు, ఆర్.రాజబాబు, దాసరి శ్రీనివాస్, చిత్రాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం మొహంతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలని స్టీల్ ఏఐటీయూసీ, మిత్ర పక్షాల నాయకులు డిమాండ్ చేశారు. జీతాల అంశంపై యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని, విశ్రాంత ఉద్యోగుల మెడికల్ స్కీమ్‌లో మార్పులు ఉపసంహరించి పాత పద్ధతి కొనసాగించాలని నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులకు 250 శాతం జీతం పెండింగ్‌లో పెట్టడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ఉక్కు మంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. ఉద్యోగుల జీతాల నుంచి మీల్ కార్డు నగదు ఉపసహరించి వాటిని మీల్ కార్డుకు పంపక పోవడం దుర్మార్గమన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీజీఎం (వర్క్స్) రంజన్ మొహంతి, హెచ్‌ఆర్ జీఎం భానులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.ఎస్.ఎన్. రావు, జె. రామకృష్ణ, డి. నర్సింగరావు, డి. దేముడు, ఎ. శివరామకృష్ణ, మోహన్‌బాబు, కనకరాజు, చీకటి శ్రీనివాస్, గణపతిరెడ్డి, మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

నేడు ఐఎన్‌టీయూసీ ధర్నా

ఉక్కునగరం: ఉక్కు కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని.. రిటైర్డ్ ఉద్యోగుల హెల్త్ స్కీం పాతదే కొనసాగించాలనే డిమాండ్ స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించరాదన్న డిమాండ్లతో నిర్వహించనున్న ధర్నాలో ఐఎన్‌టీయూసీ కార్యకర్తలు, కార్మికులు పాల్గోవాలని యూనియన్ నాయకులు కోరారు.

తిప్పల దేవన్‌రెడ్డికి సత్కారం



గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.గాజువాక పరిసర ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్య సభ్యులు కులుకూరి మంగరాజు, బెల్లాల పెంటబాబు, కె రఘునాథగుప్త, చీమకుర్తి శ్రీనివాసరావు, మొగలపల్లి త్రిమూర్తులు, కొత్త సూర్యనారాయణ, బాబు సతీష్, నాగమల్ల ప్రభోజీ, చెక్కా బంగారాజు, వేదమాత శ్రీను తదితరులు శుక్రవారం దేవన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే యాత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి, అండిబోయిన అప్పారావు, నాయుడు, నాగరాజు, పీవీ రమణ తదితరులు దేవన్‌రెడ్డిని కలిసి సత్కరించారు.

బీజేపీ నూతన జిల్లా అధ్యక్షుడికి అభినందనలు



పరశురాంరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న గాజువాక బీజేపీ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: బీజేపీ నూతన జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పరుశురాం రాజును శుక్రవారం గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, కార్యదర్శి బొండా ఎల్లాజీ రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రంగనాయకులు, పేర్ల అప్పారావు, దీనంకొండ పావని పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



దేవాడ పీహెచ్‌సీ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెదగంట్యాడ: జాతీయ బాలికా దినోత్సవాన్ని జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన బాలికల విద్య, బాలికల చట్టాలు, హింస, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. కౌమార దశలో ఉన్న బాలికలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, శ్రీనివాసరావు, గోపాలం, చంద్రిక, వెంకటేష్, పర్వీన్ బేగం, సరోజిని, సాయమ్మ పాల్గొన్నారు.



చేపలపాలెం ఎంపీపీ పాఠశాలలో..

చేపలపాలెం ఎంపీపీ పాఠశాలలో..
జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని చేపలపాలెం మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎం కూరపాటి వినోద్ కుమార్ మాట్లాడారు. బాలికలపై జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలంటే చట్టాలను కఠినతరం చేయాలని సూచించారు. అలాగే బాలికల హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. ఆపద సమయంలో ధైర్యంగా ఉండాలని, ఎవరైనా బాలికలను వేధిస్తే వెంటనే 100, 1100,112 వంటి టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హేమంత్ కుమార్, సుమ పాల్గొన్నారు.

మంచుకురిసే వేళలో..



మంచు వల్ల లైట్లతో రాకపోకలు సాగిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రహదారులతో పాటు ఉక్కునగరాన్ని శుక్రవారం మంచుదుప్పటి కప్పేసింది. విధుల కోసం ఇళ్ల నుంచి బయటకు వచ్చిన ఉద్యోగులు మంచును చూసి ఆశ్చర్యపోయారు. మంచు దట్టంగా కురవడంతో ఉదయం షిఫ్టుకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 9 గంటల వరకు ఉక్కునగరం రహదారుల్లో పొగమంచు కనిపించింది.వాహనాల లైట్లు వేసుకుని విధులకు వెళ్లారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పొగ మంచు కురిసిందని స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు అన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో పతకాల పంట



జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

అగనంపూడి: జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఏబీఎస్ పాఠశాలకు చెందిన 110 మంది విద్యార్థులకు పతకాలు దక్కాయి. ఇటీవల ముంబయ్‌కి చెందిన రంగోత్సవ సంస్థ జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించింది. వీటిలో 50 మందికి పసిడి పతకాలు, 40 మందికి రజతం, మరో 20 మందికి కాంస్య పతకాలు దక్కినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. ఈమేరకు పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు పి.ఎం.కొండయ్య, డైరెక్టర్ యు.దీపక్, చిత్రలేఖన ఉపాధ్యాయుడు నాయన సురేష్ విద్యార్థులను అభినందించారు.